క్లుప్తంగా

విధులకు సకాలంలో హాజరవ్వండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరుకావాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఆదేశించారు. పట్టణంలోని 7వ శానిటరీ డివిజన్ పరిధిలో బుధవారం ఉదయం ఆయన పర్యటించారు. డివిజన్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అలాగే అటెండెన్స్‌ను పరిశీలించి అందరు సమయ పాలన పాటించాలని సూచించారు. అలాగే పట్టణంలోని చెత్తను సకాలంలో సేకరించాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు ఉన్నారు.

9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అందరు పాల్గొనండి



తెనాలి అర్బన్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో అందరు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ కోరారు. తెనాలి మార్కెట్ యార్డులోని కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కెమికల్ ఫ్యాక్టరీలో యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల 40 మందికి పైగా చనిపోయారని ఆరోపించారు. ఫ్యాక్టరీలలో కార్మిక చట్టాలను అమలుచేసే పరిస్థితి కన్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు స్పందించి కార్మిక చట్టాలను వెంటనే అమలు చేయా లని డిమాండ్ చేశారు. అనంతరం యార్డు అధికారులకు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్ వలి, కె.ఎస్.మల్లిఖార్జునరావు, వి. వెంకటేశ్వర రావు, చినగోపాలరావు, శ్రీను, రవిబాబు, సుబ్బారావు, శేషాద్రి పాల్గొన్నారు.

మలేరియా హెల్త్ అసిస్టెంట్ మృతి



తెనాలిఅర్బన్: తెనాలి మలేరియా కార్యాయంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుత్తికొండ మహేష్ బాబు (45) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, అందె బాలచంద్రమౌళి, గుడ్డంటి రవికుమార్‌లు పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

విద్యుత్ వైర్లు సరిచేశారు

సాక్షి ఎఫెక్ట్



తెనాలి: 'వేలాడుతున్న విద్యుత్ వైర్లు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తాంశానికి స్పందన లభించింది. స్థానిక ప్రగడ కోటయ్య నగర్‌లో ఆరో లైను ఎదురుగా రెండో వీధిలో ఇళ్ల గేట్లకు తాకుతున్నట్టుగా వేలాడుతున్న విద్యుత్ వైర్లతో స్థానికులు ఆందోళనకు గురవుతున్న వైనాన్ని ప్రచురించింది. దీనితో స్పందించిన అధికారుల ఆదేశాలతో సిబ్బంది బుధ వారం ఉదయం ఆ వీధిలో దిగువకు వేలాడుతున్న 3 ఫ్లస్ సర్వీస్ వైర్లను సరిచేశారు. సమస్యను నివృత్తిచేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తంచేశారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోండి



తెనాలిఅర్బన్: టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని హైద్రాబాద్ వాసులు రమేష్, అభిమన్యులు పేర్కొన్నారు. ది తెనాలి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ఎన్‌జీవో కల్యాణ మండపంలో బుధవారం ఎ–1 ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో అనేక నూతన టెక్నాలజీ వస్తుందన్నారు. దానిని అందిపుచ్చుకుంటూ వృత్తిలో రాణించాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మేడేపల్లి ప్రభాకర్, చిలకా రఘుకుమార్, భూపాల్, గట్టా శ్రీనివాసరావు, వేంపాటి శ్రీకాంత్, రవిశంకర్, గిరీష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న 'డై'యేరియా

- తెనాలిలో ప్రబలుతున్న వ్యాధి
- రోజూ 40 నుంచి 50 మందికి చికిత్స
- పెరుగుతున్న జ్వర పీడితుల సంఖ్య
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



తెనాలి జిల్లా వైద్యశాల వార్డులో డయేరియా, జ్వర పీడితులు

తెనాలి అర్బన్: నియోజకవర్గంలో డయేరియా ప్రబలుతోంది. వాంతులు, విరోచనాలతో ప్రజలు ఇబ్బందులు పడుతూ తెనాలి పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలలకు చికిత్స నిమిత్తం వస్తున్నారు. వాతావరణంలో మార్పులతో విషజర్వాలు కూడా పెరుగుతున్నాయి. తెనాలి జిల్లా వైద్యశాలలో రోజుకు వెయ్యి మంది, అర్బన్ హెల్త్ సెంటర్లలో సుమారు 400 మంది, తెనాలి, కొల్లిపర మండలాల పరిధిలోని వైద్యశాలలో సుమారు 250 మంది వరకు చికిత్స పొందుతుంటారు. తెనాలి, కొల్లిపర మండలాల పరిధిలోని ప్రజలకు అత్యవసర వైద్యసేవలు పొందాలంటే తప్పనిసరిగా జిల్లా వైద్యశాలకు వచ్చి చికిత్స పొందుతుంటారు.

ప్రబలుతున్న వ్యాధిపీడితులు

తెనాలి పరిధిలో ఇటీవల డయేరియా కేసులు పెరుగుతున్నాయి. వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో ఎక్కువగా జిల్లా వైద్యశాలకు వచ్చి చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజు ఇలాంటి కేసులు 15 నుంచి 20 వరకు ఓపీ కింద నమోదవుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇన్ పేషెంట్‌లుగా ప్రతిరోజు ఏడుగురు వరకు చేరుతున్నారు. వీరందరికీ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు.

పెరుగుతున్న జ్వరాల కేసులు

వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల ఇప్పుడిప్పుడే ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. తరచు వర్షాలు పడుతుండటంతో తెనాలి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రతిరోజు సుమారు 30 మంది వరకు వచ్చి చికిత్స పొందుతున్నారు. కొద్దిరోజుల్లో అధికారులు పంటకాల్వలు వదిలే అవకాశం ఉంది. అది జరిగితే దోమల వ్యాప్తి పెరిగి జ్వరాల సీజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి



తెనాలి పరిధిలో ప్రజలు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడుతూ వస్తున్నారు. దీనికి కారణం కలుషిత ఆహారం, నీరు అనే చెప్పవచ్చు. ప్రజలు బయట ఫుడ్‌ను పూర్తిగా ఆపేయాలి. అలాగే కాచి చల్లార్చిన నీటిని తాగాలి. అలాగే ఇంట్లో వండిన ఆహార పదార్థాలను తీసుకోవాటం వల్ల చాలా వరకు రోగాలు దరిచేరవు. అలాగే దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలందరు వర్షాలు కురిసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి.

–డాక్టర్ టి.వినీల్, ఫిజీషియన్, తెనాలి జిల్లా వైద్యశాల.

ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం



తెనాలి జిల్లా వైద్యశాలకు ఎక్కువగా డయేరియాతో బాధపడే వారు వస్తున్నారు. అవసరమైన వారికి అన్ని రకాల పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్యశాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అలాగే అన్ని రకాల పరీక్షలు చేసేందుకు అవసరమైన అత్యాధునిక ల్యాబ్ ఉంది. ఎటువంటి పరిస్థితి ఎదురైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

–డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్, జిల్లా వైద్యశాల, తెనాలి.

పసుపు సాగుకు 'చినుకుపడింది'

మండలంలో జోరుగా పసుపు విత్తులు

కొల్లిపర: అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో తొలకరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే మెట్ట పొలాలను దున్ని పసుపు విత్తనాలు వేసేందుకు సిద్ధం చేశారు. వర్షాలతో నేల పదును కావడంతో పసుపు కొంత మంది రైతులు వేశారు. మరికొంత మంది విత్తనాలు నాటడానికి అన్ని రకాలుగా రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే పసుపు విత్తనాలను మండలంలోని తూములూరు, మున్నంగి, వల్లభాపురం, లంకభూములు, కొల్లిపర గ్రామాల్లో సాగు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం మూడు రోజులుగా సన్నపాటి జల్లులు పడడంతో మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో పసుపు నాటటం పూర్తయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. వీటితో పాటు మధ్యలో ఇంటి అవసరాల కోసం మిరప నారుమళ్లు చేయనున్నారు. ప్రస్తుతం రైతులు పసుపు విత్తనం పుట్టి (225 కిలోలు) ధర రూ.6 వేల 500 నుంచి 7 వేల వరకు గ్రామాల్లో కొనుగోళ్లు చేస్తున్నారు.

మండల పరిధిలో పసుపు సాగు ఇలా

మండల పరిధిలో పసుపు సాగు విస్తీర్ణం మొత్తం 2,463 ఎకరాలు ఉండగా ఇప్పటి వరకు రైతులు 510 ఎకరాల్లో పసుపు విత్తనాలు నాటారు. మరో వారం రోజుల్లో సుమారు 1200 ఎకరాల్లో రైతులు విత్తు నాటే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.



పొలంలో పసుపు కొమ్ములు నాటుతున్న రైతులు

భూసార పరీక్షల ద్వారా ఎరువులు వాడాలి

కొల్లిపర: రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించుకుని తద్వారా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని అత్తోట, కుంచవరం గ్రామాలల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులు ఆశించిన దిగుబడి సాధించవచ్చునన్నారు. కౌలు రైతులు కౌలు కార్డుల కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా కింద వరి ఎకరానికి రూ.800 రూపాయలు, మినుము పంట ఎకరానికి రూ.200 రూపాయలు ఆగస్టు 15వ తారీకు లోపుల రైతులు చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరెడ్డి

జీవాల్లో నట్టల నివారణ మందు పంపిణీ

- పశుసంవర్ధకశాఖ తెనాలి డివిజన్‌లో 75,237 జీవాలకు పూర్తి
- పదో తేదీలోగా మిగిలిన జీవాలకు మందు
- డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.పద్మావతి



రామచంద్రాపురంలో నట్టల నివారణ మందును ఇస్తున్న డాక్టర్ వై.పద్మావతి, సిబ్బంది

తెనాలిటౌన్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి తొలి విడత గొర్రెలు, మేకల్లో ఉచిత సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని జరుపుతున్నట్టు తెనాలి డివిజన్ పశుసంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.పద్మావతి బుధవారం తెలియజేశారు. గుంటూరు జిల్లా తెనాలి డివిజనులోని మొత్తం గొర్రెలు 31,114 ఉండగా, వీటిలో 26,597 గొర్రెలకు నట్టల నివారణ మందును ఇప్పటివరకు ఇచ్చినట్టు తెలిపారు. మేకలు 7,125కుగాను 4,805 మేకలకు మందును తాగించినట్టు చెప్పారు. అదేవిధంగా బాపట్ల జిల్లా పరిధిలో పశుసంవర్ధకశాఖ విభాగంలో ఉన్న తెనాలి డివిజనులో 88,262 గొర్రెలు ఉండగా, వీటిలో 40,065కు, 15,434 మేకలకు గాను 3,772 మేకలకు నట్టల నివారణ మందును ఇచ్చామని వివరించారు. జిల్లా పరిధిలోని తెనాలి డివిజనులో మొత్తం గొర్రెలు, మేకలు కలిపి 38,238 జీవాలకుగాను 31,402లకు, బాపట్ల జిల్లా పరిధిలోని తెనాలి డివిజనులో గొర్రెలు, మేకలు కలిపి 1,03,697 జీవాలకు గాను 43,835 జీవాలకు మందును ఇవ్వగలిగామని తెలియజేశారు.

జులై పదో తేదీలోగా మిగిలిన అన్ని గొర్రెలు, మేకలకు కూడా ఉచితంగా నట్టల నివారణ మందును సమీప పశువైద్యశాలల ద్వారా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. నట్టల నివారణకు ముందుగా గొర్రెలు, మేకల పేడను పరీక్షించి, వాటిలో ఉన్నటువంటి పరాన్నజీవులను బట్టి వాటికి మందులను ఎంపిక చేయటమైందనీ, నట్టల నివారణ కార్యక్రమం పూర్తి అయిన వెంటనే జీవాల పేడను పరీక్ష చేయటం జరుగుతుందని తెలిపారు. నట్టల నివారణ కార్యక్రమం వల్ల జీవాల్లో సరైన బరువు పెరుగుదల, ఆరోగ్యంగా ఉండటం, సకాలంలో పునరుత్పత్తి జరిగి జీవాల సంఖ్య పెరుగుతూ లబ్ధిదారులకు ఆర్థికపరంగా ఉపయోగపడుతుందని డాక్టర్ పద్మావతి వివరించారు. వీరితో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి ఉన్నారు.

సీనియర్ వైద్యులకు సత్కారం



డాక్టర్ సాంబిరెడ్డిని సత్కరిస్తున్న వైద్యులు

తెనాలిరూరల్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇక్కడి బోస్ రోడ్డులోని శ్యామల రత్తమ్మ, డాక్టర్ మేజర్ కాకుమాని వుల్లక్కి మెమోరియల్ ఐఎంఏ హాలులో జరిగిన కార్యక్రమంలో సీనియర్ వైద్యులైన పట్టణానికి చెందిన డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ జి. మధుప్రభాకర్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కొత్తమాసు శ్యాంప్రసాద్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ కోటి నాగయ్య, డాక్టర్ గంట నరసింహారావు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు ఇతర ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించు పనుల కారణంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏపీసీపీడీసీఎల్ డీఈఈ బోరుగడ్డ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టణంలోని చినరావూరు స్టేషన్‌రోడ్డు, డొంక రోడ్డు, చినరావూరు, రామలింగేశ్వరపేట, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సుందరయ్య నగర్, గాంధీ చౌక్, ప్రకాశంరోడ్డు, నారాయణ స్వామి హాస్పిటల్ రోడ్డు, రజక చెరువు రోడ్డు ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కట్నం వేధింపులపై కేసు

తెనాలిరూరల్: తనను భర్త అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదైంది. పట్టణ నందులపేటకు చెందిన జరీనా, ముజీబ్ బాషాలకు పదేళ్ల క్రితం వివాహమైనా పిల్లలు లేరు. ఇటీవలి కాలంలో తనను భర్త అదనపు కట్నం తెమ్మంటూ వేధింపులకు గురి చేస్తున్నాడని ఆమె పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు కేసు బుధవారం నమోదు చేశారు.

విద్యుత్ వినియోగదారులపై భారాలు వేయొద్దు

మంగళగిరి టౌన్: స్మార్ట్ మీటర్లు బిగించి విద్యుత్ వినియోగదారులపై కూటమి ప్రభుత్వం భారాలు వేయడం సరికాదని సీపీఎం నాయకులు విమర్శించారు. రత్నాలచెరువులో బుధవారం స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోవాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మార్ట్ మీటర్ల వల్ల జరిగే అనర్థాలను స్థానికులకు వివరించారు. దీనిపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్ల విద్యుత్ వినియోగదారులపై భారం వేశారని అన్నారు.

మురుగు కాల్వలపై కట్టడాలు నిర్మించవద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



కాల్వలపై ఆక్రమణలు తొలగింపజేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలపై ర్యాంప్‌లు, బండలు ఏర్పాటు చేయటం వల్ల కాల్వల మరమత్తులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాటిపై ఎటువంటి కట్టడాలు నిర్మించవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 4,5 వార్డులలో బుధవారం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఎక్కువ మంది కాల్వలపై ర్యాంప్‌లు ఏర్పాటు చేయడాన్ని గమనించిన ఆమె సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఎందుకు ఇప్పటి వరకు వాటిని తొలగించలేదని ప్రశ్నించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. కాల్వలను ప్రతిరోజు కార్మికులు బాగు చేయాల్సి ఉంటుందని, అలా చేయపోతే నీరు పారుదల లేక ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. ఆమె వెంట కౌన్సిలర్‌లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, తోట రఘురామ్, శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న పాస్టర్ జ్యోతి బాబు

అత్తులూరివారిపాలెం(కొల్లిపర): మండల పరిధిలోని అత్తులూరివారిపాలెంలో రక్షణ సైన్యం చర్చిలో పాస్టర్ దొప్పలపూడి జ్యోతిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు నిర్వహించారు. జ్యోతిబాబు చర్చి ఆవరణలో సాల్వేషన్ ఆర్మీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ గత 160 సంవత్సరాలుగా 185 దేశాల్లో దేవుని సేవలోనే కాక సమాజ సేవలో కూడా సాల్వేషన్ ఆర్మీ చేస్తున్న సేవలు ప్రపంచవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందుతున్నట్లు తెలిపారు. సందేశం అనంతరం చర్చిలో మిఠాయిలు పంచిపెట్టినారు. ఈ కార్యక్రమంలో సాల్విష్ట ఆర్మీ సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

మా ఏపీలో సభ్యత్వ రుసుం రద్దు

వ్యవస్థాపకులు దిలీప్‌రాజా

తెనాలిఅర్బన్: మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ (మా–ఏపీ) సభ్యులుగా చేరదలచిన వారు ఎలాంటి సభ్యత్వ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని సంస్థ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా పేర్కొన్నారు. తెనాలిలోని మా–ఏపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం పారదర్శకతకు లోబడే ఈనిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. సినీ పరిశ్రమలోని 24 విభాగాలలోని నటీనటులు, సాంకేతిక నిపుణులు సభ్యత్వం తీసుకోవచ్చునన్నారు. గతంలో రూ.రెండు వేలుగా ఉన్న సభ్యత్వ రుసుంను కార్యవర్గ ఆమోదంతో రద్దు చేసినట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు తెనాలిలోని మా ఏపీ కార్యాలయంలో వివరాలుయ ఈనెల 31వ తేదిలోగా అందజేయాలని సూచించారు. సమావేశంలో నటులు మిలటరీ ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

రహదారుల వెంట వ్యర్థాలు

- డంపింగ్ యార్డుకు చేరాల్సిన చెత్తను పట్టణం నలువైపులా చెత్తను డంప్ చేస్తున్నారు
- మున్సిపల్ అధికారులకు స్వచ్ఛంద సంస్థ ఫిర్యాదు



రహదారుల వెంబడి కుమ్మరించిన చెత్త, ఇతర వ్యర్థాలు



రోడ్డు వెంట ఖాళీ కొబ్బరి బోండాలు గుట్ట

తెనాలి: పట్టణంలో కొండలా పేరుకుపోయిన డంపింగ్ యార్డులో చెత్త తరలింపు ప్రక్రియ నెలల తరబడి కొన'సాగుతూనే' ఉంది. అక్కడ ఏళ్లతరబడి ఉన్న చెత్తను మట్టి రూపంలోకి మార్చే కార్యక్రమం ఒకపక్క కొనసాగిస్తూనే, రోజువారీ వస్తున్న చెత్తను జిందాల్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. అయినా డంపింగ్ యార్డులో చెత్త ప్రధాన గేటు వరకు వేస్తున్నారు. ఆ రోడ్డుపై ప్రయాణించే వారికి దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అక్కడలా ఉంటే, డంపింగ్ యార్డుకు చేరాల్సిన చెత్తలో కొంతభాగం ఊరికి నలుమూలల గల ప్రధాన రోడ్లపై కుమ్మరిస్తున్నారు. తెనాలి- గుంటూరు రోడ్డు, పినపాడు-యడ్లపల్లి రోడ్డు, తెనాలి-చినపరిమి రోడ్డు, తెనాలి-పెదరావూరు రోడ్ల పక్కన ఇప్పుడు ఎక్కడ చూసినా చెత్త గుట్టలు దర్శనమిస్తున్నాయి. ఊరిలోకి వచ్చేవాళ్లకు వెళ్లేవారికి దుర్వాసనతో స్వాగతం పలుకుతున్నాయి. మున్సిపల్ ట్రాక్టర్లలో చెత్తను తీసుకెళ్లేవారే డంపింగ్ యార్డు వరకు వెళ్లలేక, తమకు సమీపంలోని ఏదొక ఇతర రహదారుల్లోకి తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

అలాగే కొబ్బరి బోండాల గుట్టలు దర్శనమిస్తున్నాయి

పట్టణంలో కొబ్బరి బోండాల వ్యాపారులు, ఖాళీ కొబ్బరి బోండాలను ఇంతకుముందు బుర్రిపాలెంరోడ్డు పక్కన వేస్తుండేవారు. దీనిపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో వాటిని తొలగించి, అక్కడి రోడ్డు మార్జిన్లలో కొబ్బరి బోండాలు వేస్తే శిక్షిస్తామని బోర్డులు పెట్టారు. దీనితో ఇప్పుడు కొందరు వ్యాపారులు ఊరి వెలుపల ఇతర గ్రామాలకు వెళ్లే రహదారుల కేసి చూస్తున్నారు. రాత్రివేళల్లో రోడ్ల వెంట కుమ్మరించి వెళుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఎలాంటి సమాచారం లేదు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం తరపున బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు ఇదే అంశంపై వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ ట్రాక్టర్లలో చెత్తను ఊరి వెలుపల ఇతర గ్రామాలు, పట్టణాలకు దారితీసే రోడ్ల వెంట పోస్తున్నారని వారు తెలియజేశారు. రహదారుల వెంట చెత్త వేయకుండా నివారించాలని కోరారు.

ఈ విషయమైన మున్సిపల్ కమిషనర్ లక్ష్మీపతిని వివరణ కోరగా, మున్సిపల్ ట్రాక్టర్లలో చెత్తను ఊరివెలుపల రహదార్ల వెంట వేస్తున్నారనేది వాస్తవం కాదని చెప్పారు. దగ్గర్లోని చిన్న పరిశ్రమల నుంచి వ్యర్థాలను ఆవిధంగా రోడ్లవెంట పడేస్తున్నారని భావిస్తున్నానని తెలిపారు. ఏదేమైనా దీనిపై ఇప్పుడు సమావేశం జరిపి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశానని చెప్పారు. రాత్రివేళల్లో ఈ బృంద సభ్యులు గస్తీ తిరుగుతూ చెత్తను రోడ్లవెంట వేస్తేవారిని గుర్తిస్తారని చెప్పారు. అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఒకవేళ మున్సిపల్ ట్రాక్టర్లే అందుకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

కార్పొరేట్ గుప్పెట్లో మోదీ ప్రభుత్వం



మంగళగిరి టౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో ఉందని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ఆరోపించారు. మంగళగిరి నగరపరిధిలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం పట్టణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక చట్టాలు, విద్యుత్ స్మార్ట్ మీటర్ల దోపిడీపై మండిపడ్డారు. ఈనెల 6న జరిగే పార్టీ పట్టణ 26వ మహాసభను, 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అన్నవరపు ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.